క్లుప్తంగా

ఎస్‌జీ కళాశాలలో రేపు జాబ్‌మేళా

పీలేరు రూరల్ : స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హెట్రోడ్రగ్స్, నాయక్ అగ్రోస్ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీలో కెమిస్ట్రీ చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 9989796815 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టూటౌన్ ఎస్‌ఐగా ఇనాయతుల్లా


ఇనాయతుల్లా

మదనపల్లె : పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ హేమాద్రిని వీఆర్‌కు పంపుతూ, ఆయన స్థానంలో రాయచోటిలో పనిచేస్తున్న ఎస్‌ఐ ఇనాయతుల్లాను టూటౌన్‌కు బదిలీచేశారు. ఈ సందర్భంగా ఇనాయతుల్లా మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

సచివాలయ సిబ్బందికి నోటీసులు

కలకడ : వేళకు విధులకు హాజరకాని సచివాలయ సిబ్బందికి నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ముడియంవారిపల్లె సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అయితే సచివాలయ సిబ్బంది హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

3 నుంచి బడేమకాన్ ఉరుసు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు బస్టాండు వద్దనున్న హజరత్ సైదానిమా (బడేమకాన్ దర్గా) ఉరుసు ఉత్సవాలు డిసెంబర్ 3 నుంచి ప్రారంభమవుతాయని దర్గా మకాన్‌దార్ సయ్యద్‌హాషిం తెలిపారు. 3న సందల్, 4న ఉరుసు, ముషాయిరా, 5న తహలీల్‌ఫాతెహా, ఖవ్వాలీ జరుగుతాయన్నారు.

దారి సమస్య పరిష్కరించాలని వినతి

ములకలచెరువు: మండలంలోని వేపూరికోట పంచాయతీ ఉమాశంకర్ కాలనీకి దారి సమస్య పర్కిరించాలని కాలనీ వాసులు, సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి దారి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

పండుగలా వికసిత్ భారత్

కురబలకోట: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండలంలో పండగలా సాగుతోంది. సోమవారం మనమరెడ్డిగారిపల్లె (పెద్దపల్లె)లో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి మాట్లాడుతూ 2047 కల్లా దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారగలదన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక స్వాలంభన సాధించాలన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి, నాయకులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు, పెద్దగొని శ్రీనివాసులు, కె. ప్రణయ్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, మండల జానపద కళాకారుల బృందం నాయకురాలు సింగన్నగారిపల్లె ఉప్పతి రమణమ్మ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పీలేరు రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడిట్స్, అధ్యాపకులు, ఇతర విద్యార్థులు మొత్తం 42 యూనిట్ల రక్తం ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

వాల్మీకిపురం: మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న జీఎస్‌టీయూ కళాశాల వద్ద మండలంలోని మూరేవాండ్లపల్లికు వెళ్లేందుకు సర్వీసు రోడ్డు బదులు అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సీఐ సురేష్ కుమార్ సంఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని, మీ సమస్యను ఎన్‌హెచ్ అధికారులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

గ్రామకంఠం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె గ్రామపంచాయతీ కస్పాలో గ్రామకంఠం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండామనోహార్ సోమవారం తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు ఫిర్యాదు చేశారు.

ఆరనీకుమా ఈ దీపం..కార్తీక దీపం

శివాలయాల్లో ప్రణవనాదం ప్రతిధ్వనించింది. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతోపోటెత్తాయి. కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మదనపల్లె దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయంలో కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. నిమ్మనపల్లె, రామసముద్రం, పీలేరు, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కలికిరి, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లోని శైవ ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. పలువురు కేదారేశ్వర వ్రతం ఆచారించారు. శివనామస్మరణ మారుమోగింది. ఆలయాల వద్ద ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


నిమ్మనపల్లె : కార్తీకపౌర్ణమి సందర్భంగా దీపం వెలిగిస్తున్న మహిళలు


వాల్మీకిపురం: నోములు నోచుకుంటున్న మహిళలు


మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి


మదనపల్లె సిటీ: దీపాలు వెలిగిస్తున్న మహిళలు


నిమ్మనపల్లె : నేల మల్లేశ్వరస్వామి కల్యాణం


గుర్రంకొండ: కేదారేశ్వరీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు,


కలకడ: సిద్దేశ్వరస్వామి ఆలయంలో..


పెద్దతిప్పసముద్రం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు


పీలేరు: నోముల వ్రతంలో పాల్గొన్న భక్తులు


కలికిరి: సోమేశ్వరస్వామి ఆలయంలో..


ములకలచెరువు: బురకాయలకోట శివాలయంలో భక్తులు


కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై వ్రతం ఆచరిస్తున్న మహిళలు

నూతన సంస్కరణలకు ఆద్యుడు జగన్

పీలేరు : నూతన సంస్కరణలకు ఆద్యుడు ముఖ్యమంతి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె, చింతల బైలు, జంగంపల్లె, చిన్నయ్యగారిపల్లె, నగిరి, సాములవారిపల్లె, బయ్యారెడ్డిగారిపల్లె, వరగంరెడ్డిగారిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అందిన పథకాలు లబ్ధిదారులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వంద శాతం నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అడవిపల్లె, జంగంపల్లెలో గ్రామస్తుల కోరిక మేరకు సిమెంట్ రోడ్లు, కాలువల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ గుండాల మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, సర్పంచ్‌లు శిరీష, జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణనాయుడు, నాయకులు అబ్బవరం అమరనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లయ్యనాయుడు, మస్తాన్, తిమ్మ య్య, రాజానాయుడు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మార్కెట్‌యార్డులో రైతులకు అన్నదానం

మదనపల్లె : ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ 54 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా భాగంగా సోమవారం మార్కెట్ యార్డులో డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, రీస్ ఎక్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయప్రదీప్ సుబ్రమణ్యన్ చేతుల మీదుగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.వి.రత్తయ్య, రీజనల్ మేనేజర్ వేణుమాధవ్, శంకర్, వెంకటేశ్వరరావు, సుందరరాజు, సర్వేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

రామసముద్రం : రామసముద్రం దిగువపేటలో ఉన్న చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా ఆకాశదీపం, ఆదివారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆకాశదీపం వెలుగులు, జ్వాలాతోరణంలో వందలాది భక్తులు శివ,పార్వతీదేవి ఉత్సవమూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

కలకడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంటులో పాల్గొనేందుకు క్రీడాకారులు పేరు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం నుంచి డిసెంబర్ 15వతేదీ వరకు క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

పీలేరురూరల్ : రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడిగా నియమితులైన కోనేటి పరుశురాం సోమవారం ఎంపీ మిథున్ రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధి కృషి చేసి ఇచ్చిన పదవికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జయరామచంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కులయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరుశురాం

కమనీయం.. సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో సోమవారం శ్రీ వల్లిదేవ సేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లిదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురళీమోహన్, సారధి, పద్మ, వసంతమ్మ, శశికళ, రాధమ్మ, కోమల, మీనాక్షి, నిరంజన్, వంశి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మున్వార్‌హోలిసా దర్గా ఉరుసు

రామసముద్రం : రామసముద్రం మండలపరిధిలోని కొత్తూరు క్రాస్ నందు హజ్రత్ మున్వర్ హోలిషాఖ్ దర్గాలో ఆదివారం, సోమవారం ఉరుసు వైభవంగా నిర్వహించారు. దర్గాను బెంగళూరు నుంచి పలురకాల పుష్పాలు తెచ్చి అలంకరణ చేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. కర్ణాటక, తమిళనాడు నుంచి మతపెద్దలు, ముస్లిం సోదరులు హాజరయ్యారు. మహ్మద్ గౌస్, మహ్మద్ అలీషా ఖాదరి, చమన్‌పీర్ సయ్యద్ ఖాదరీ, మహ్మద్ ఖాదరీ, సయ్యద్‌పీర్ ఖాదరీ, ఖాదర్‌బాషా గంధం ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సల్మా, మతపెద్దలు, ముస్లింసోదరులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె : ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు వస్తున్నాయని, వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజాసమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...వర్షాకాలంలో ప్రజలు విషజ్వరాలు, డెంగీతో బాధపడుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మిని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య స్థితిగతులను మెరుగుపరచడమే కాకుండా కాలువల్లో పూడికలు తొలగించి, దోమలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లె మండలం అగ్రహారంకు చెందిన చల్లా వెంకటరమణ..తమ గ్రామంలో రీసర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు తన భూమి లేదంటున్నారని ఫిర్యాదు చేశారు. సర్వేనెం.1344/1, 1342/2లో 4.84 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డులైన 1బి, అడంగల్‌లో కనిపిస్తున్నప్పటికీ సర్వే అధికారులు భూమి లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం భూమిలో రెండుబోర్లు ఉన్నాయని, కొన్నేళ్లుగా సేద్యం చేసుకుంటున్నానని, తనకు కొత్తగా మంజూరైన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు పాసుబుక్కు మంజూరుచేయాల్సిందిగా వేడుకున్నాడు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లెకు చెందిన గంగాధర్ తమ తాత నుంచి సంక్రమించిన కుటుంబ ఆస్తికి సంబంధించి ఇప్పటివరకు భాగపరిష్కారాలు జరగలేదన్నారు. అవి జరిగేంతవరకు తమ కుటుంబసభ్యుల్లో ఎవరిపేరు మీద పాసు పుస్తకాలు మంజూరు చేయవద్దని వినతిచేశారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి